

'నువ్వు ఆడదానివి కాదు...'

'ఆడదాన్ని కాకపోతే నాతో ఇన్నాళ్ళూ కాపురం ఎలా చేశారు?'

'నువ్వు వట్టి గొడ్రాలివి...'

'గొడ్రాళ్లు అయితే ఆడవాళ్ళు కారా?'

'పిల్లల్ని కనందీ ఒక ఆడదేనా...?'

'దానికి నన్నేం చెయ్యమంటారు? నాలో ఏ లోపం లేదని లేడీ డాక్టర్ చెప్పిందిగా?'

'ఏ లోపం లేకపోతే పిల్లలు పుట్టాలిగా...'

'మిమ్మల్ని పరీక్షించిన డాక్టరు పిల్లలు పుట్టకపోడానికి లోపం మీ లోనే వుందని చెప్పాడుగా... మర్చిపోయారా?'

'నాన్సెన్స్! వాడో బోడి డాక్టరు- వాడో చెప్పటమూను- వెధవ నా చెప్పుతీసుకుని కొట్టాలి! మొగాళ్లో లోపం వుంటం ఏంటి- ఎక్కడైనా వుంటుందా అలా...?'

'నమ్మకపోతే మానెయ్యండి- నన్నేం చెయ్యమంటారు? నాలో ఏం లోపం లేదని లేడీ డాక్టర్ చెప్తుంటే...?'

'నాకదంతా తెలీదు. కాపరానికొచ్చి ఐదేళ్లయింది. ఇంతవరకు పిల్లలు పుట్టలేదు. మా అన్నయ్య లందరికీ పెళ్ళయిన ఏడాది నుంచే పిల్లలు పుట్టుకొచ్చారు చూట్టం లేదా? అందరి ముందు నాకు తలవంపులుగా వుంది. వారసుల్లేకపోతే నా ఆస్తి అంతా ఇతరుల పాలయిపోతుంది. నాకు పున్నామ నరకం తప్పదు...'

'పోనీ ఎవర్నన్నా పెంచుకుందామండి.'

'ఛీ! ముదనష్టపుదానా! సిగ్గూ శరం లేనిదానా...'

'ఇందులో సిగ్గు పడేదేముందండీ? పిల్లల్లేకపోతే ఎవర్నయినా పెంచుకోటం లోకంలో వున్న పద్ధతేగా?'


'దరిద్రపు ముండా! నన్ను అవమానిస్తున్నావంటే? నేను మగాణ్ణి కాదంటే? నాకు మగతనం లేదంటే గొడ్రాలు ముండా? నీ చచ్చు సలహాలు నాకేమీ అక్కర్లేదు. మా వంశంలో ఇంతవరకు పిల్లల్ని పెంచుకునే గతి ఎవరికీ పట్టలేదు. పిల్లలు పుట్టకపోతే ఇంకో పెళ్ళి- ఇంకో పెళ్ళి- అలా ఎన్ని పెళ్ళిళ్ళయినా చేసుకుంటారు. నాకేం ఖర్మ పట్టింది, పిల్లలు పుట్టకపోయినా నిన్నే పట్టుకుని వేళ్లాడుతూ, పరాయి పిల్లల్ని పెంచుకోడానికి? ఇదిగో విజయా! నిన్ను వదిలేసి మరో పెళ్ళి చేసుకోడానికి నిర్ణయించుకున్నాను. నువ్వు తక్షణమే మీ పుట్టింటికి వెళ్ళిపో' అంటూ చరచరా వెళ్ళిపోయాడు రంగనాథం.

తనకు పక్కనే పిడుగుపడ్డట్టనిపించింది విజయకు అనుకోని ఈ విపత్తుకు. రాత్రంతా ఏడుస్తూనే కూర్చుంది. ఆమెకు ఏం చేయడానికీ పాలుపోలేదు.

తండ్రి తన చిన్నతనంలోనే పోయాడు. అమ్మే అన్నయ్యను, తనను పెంచిపెద్దచేసింది. వున్న పొలం కాస్త అన్నయ్య చదువుకి, తన పెళ్ళికి అయిపోయింది. అన్నయ్య పెళ్ళయ్యాక ఉద్యోగం కోసం దూరం ఊళ్ళకు వెళ్ళిపోయాడు. పెద్దతనంలో అమ్మను యేమీ పట్టించుకోడం లేదు. అప్పట్నుంచి అమ్మ తను ఒక గదిలో వుంటూ, మిగతా ఇల్లంతా అద్దెకిచ్చేసి, ఆ అద్దె డబ్బులతో కాలం గడుపుతోంది. అలాంటి పరిస్థితిలో తను వెళ్ళి అమ్మకు గుదిబండలా ఎలా తయారవ్వాలి? తన్ను మొగుడొదిలేశాడంటే నిజంగా అమ్మ గుండె ఆగిపోతుంది.

మొగుడొదిలేసిన ఆడదాన్ని చుట్టపక్కాలు యెంత చిన్నతనంగా చూస్తారు? ఈలోకం యెంత చులకనగా చూస్తుంది? తన తప్పేం లేదన్నా వింటారా? యేం చేశావో యేంటో అందుకే మొగుడు గెంటేశాడు అంటారు. ఇప్పుడు ఏంటి దారి?

ఈ అయిదేళ్ళ కాపురంలో తాను పెద్దగా సుఖపడింది లేకపోయినా - ఏదో తిండికి గుడ్డకు లోటు లేకుండా జరిగిపోతోంది. రంగనాథం ఏనాడూ తనను అభిమానంగా చూసింది, ఆదరించింది లేదు. జీవితంలో సరదా, సంతోషం లేకపోయినా వున్నదాంతోనే ఆమె తృప్తిపడ్తూ వుండేది. ఉమ్మడి కుటుంబం ప్రొద్దున్న లేచిందగ్గర్నించీ ఇంట్లో ఏదో ఒక చాకిరీ చేస్తూ వుండడం- రాత్రి భర్త పక్కలోకి వెళ్లి, అతనిక్కావాల్సిన సుఖాన్ని ఇవ్వడం- ఇంతే తన బ్రతుకు- దాంతోనే సరిపెట్టుకుంటోంది. ఇప్పుడు తనకు ఈ భాగ్యం కూడా లేకుండా పోయేట్టుంది- ఈ విపత్తు ఒకటి వచ్చి పడింది- యేంటి చెయ్యటం?



తెల్లారి విజయ మామూలుగా పని చేయడానికి ఇంట్లోకి వెళ్ళింది. అత్త ఆమెను పనిముట్టుకోనివ్వకుండా చీదరించుకొంది. మామగారు 'గొడ్రాలిముండా! నువ్వు మా ఇంట్లో వుండడానికి వీల్లేదు పో' అని నోటికి వచ్చినట్లల్లా

# ప్రేమ జీవి




తిట్టాడు. బావగార్లు కూడా ఇష్టం వచ్చినట్టు తిట్టి ఇంట్లోంచి వెళ్ళిపొమ్మన్నారు - తోటికోడళ్ళు యేమీ అనలేక చూస్తూ ఊరకుండి పోయారు.

విజయకు గుండెల్లో బాంబులు పేలినట్టనిపించింది. యేమిటి ఈ మనుష్యులు -అసలు వీళ్ళు మనుషులా రాక్షసులా? ఇన్నాళ్ళూ తనచేత గొడ్డు చాకిరీ చేయించుకొని, వున్నట్టుండి ఇవాళ తనను గొడ్రాలంటు ఇంట్లోంచి వెళ్ళిపొమ్మంటారా? అందరిదీ ఒకటే మాట - అందరిదీ ఒకటే నిర్ణయం - మొగుడు తనని విడిచిపెట్టేయ్యాలి- తను వాళ్ళింట్లోంచి వెళ్ళి పోవాలి- మొగుడికి ఇంకో పెళ్ళి చేయాలి!

విజయకు అవమానంతో, ఆందోళనతో కళ్ళు తిరిగాయి- కిందపడిపోబోయింది. ఎలాగో నిల దొక్కుకుని తన గదిలోకి వెళ్ళి పోయి మంచం మీద యేడుస్తూ పడుకుంది. తిండీ తిప్పలు లేకుండా అలాగే పడి వుంది.

ఆ రాత్రి రంగనాథం ఇంటికి వచ్చీ రాగానే గదిలో విజయను చూసి, 'ఇంకా పోలేదంటే ముండా! నీ పాపిష్టి మొహం నాకు చూపించొద్దన్నాగా...' అంటూ ఆమెను జుట్టు పట్టుకుని మంచం మీంచి కిందికి లాగి, బూటు కాళ్ళతో ఇష్టం వచ్చినట్లల్లా తన్ని గదిలోంచి బైటకు లాగేశాడు- ఆమెకు స్పృహ తప్పింది.

విజయకు తెలివి వచ్చేటప్పటికి అర్థరాత్రి అయిపోయింది. ఇంట్లో అందరు యే ఘోరం జరగనట్టు గానే- ఒక ఆడపిల్ల చిత్రహింసలకు గురైందన్న ఆలోచన కూడా లేకుండా యే మాత్రం జాలి, కరుణ,మానవత్వం లేకుండా - సుష్టుగా భోజనాలు చేసి ఎవరి గదుల్లో వాళ్ళు హాయిగా పడుకున్నారు.

ఇదేంటి- తన బ్రతుకు ఎందుకిట్లా ముక్కలవుతోంది? ఈ లోకంలో నీతి న్యాయం అనేవి ఏకోశానా లేవా? ఒక స్త్రీని తను చెయ్యని నేరానికి ఎందుకిట్లా అందరూ కూడగట్టుకుని శిక్షిస్తున్నారు? తను ఏం తప్పు చేసిందని? పిల్లలు కలక్కపోతే తన తప్పా? భర్త తన లోపాన్ని కప్పిపుచ్చుకుంటూ, తన లోపం ఏమీ లేదన్నట్టుగా మాట్లాడుతూ, లేని లోపాన్ని తనకు ఆపాదిస్తూ తన్ను హింసించడం యేమిటి?

విజయకు దెబ్బలతో వళ్ళంతా పచ్చిపుండు అయింది. మెల్లిగా లేచి తలుపుకు ఆనుకొని కూర్చుంది. ఏమిటి ఈ అన్యాయం? ఏమిటి ఈ అవినీతి? ఏమిటి ఈ అక్రమం? తను చేయని నేరానికి ఈ శిక్ష అనుభవించాల్సిందేనా? తన జీవితం నాశనం అవ్వాల్సిందేనా? తన బ్రతుకు ఏంకాను? తను ఎక్కడికి వెళ్లాలి? ఎలా జీవిం



నాలి? అనురాగం, ఆత్మీయత లేక పోయినా భర్త నీడన తను ఇన్నాళ్లూ తృప్తిగా కాలం గడుపుతోంది. ఆ నీడ తప్ప తనకు మరో నీడ లేదు. తనకు పిల్లలు పుట్టలేదన్న కారణంగా తనకున్న ఆ ఒక్క నీడ కూడా లేకుండా పోతోంది - అన్న తలంపు రాగానే ఆమెకు గుండె ఒక్కసారిగా ఆగిపోయినట్లనిపించింది.

లేదు... లేదు... అలా జరగడానికి వీల్లేదు ... అలా ఎన్నటికీ జరగడానికి వీల్లేదు ... యేమైనా సరే తనకున్న ఆ ఒక్క నీడను కోల్పోడానికి వీల్లేదు ... తన బ్రతుకు బండలవ్వడానికి వీల్లేదు ... తన బ్రతుకు బజారు పాలవడానికి వీల్లేదు ... తన బ్రతుకు నవ్వుల పాలైపోడానికి వీల్లేదు ... తన బ్రతుకు అంతమై పోవడానికి వీల్లేదు ... యేమైనా సరే వీళ్ళకు బుద్ధి చెప్పాలి ... తన బ్రతుకుని, సంసారాన్ని కాపాడుకోవాలి ... ఒకటే ఆలోచన ... అదొక్కటే ఆలోచన...విజయకు.

తెల్లారబోతోంది - విజయ మెల్లగా లేచి జుట్టు ముడివేసుకుంది. 'యేమండి! యేమండీ!' అని తలుపు కొట్టింది. కొంత సేపటికి రంగనాథం తలుపు తీశాడు.

'ఏమండీ, మీరు కోరినట్టుగానే వెళ్ళిపోతాను. వెళ్ళబోయే ముందు నాదో చిన్న కోరిక తీర్చండి,' అంది ప్రాధేయపడుతూ.

'యేంటి చెప్పి తగులడు,' అన్నాడు రంగనాథం అయిష్టంగా మొహం పెట్టి.

'కాస్త నన్ను లోపలికి రానివ్వండి, లోపల చెప్తాను,' అంది విజయ మెల్లిగా.

రంగనాథం విసురుగా లోపలికి నడిచాడు.

విజయకు కొండంత బలం వచ్చింది. కళ్ళనీళ్ళు తుడుచుకుని మెల్లిమెల్లిగా అడుగులు వేస్తూ భర్త వెనకాలే లోనికి వెళ్ళింది.

ధైర్యం చిక్కబట్టుకొని, భర్త మొహం లోకి చూస్తూ మెల్లిగా అంది - 'మా బామ్మకి ఎన్నేళ్లకీ పిల్లలు పుట్టకపోతే, నెళ్ళాళ్ళు దీక్షగా సంతానలక్ష్మి వ్రతం చేయించారట. చివరిరోజున ఉద్యాపన చేసుకొన్న నాటి రాత్రి సంతానలక్ష్మి మా బామ్మ కల్లోకి వచ్చి, 'నీకు సంతానం ప్రసాదిస్తున్నాను' అని చెప్పిందట. నెల లోపలే మా బామ్మకు నెలతప్పి మా నాన్న పుట్టాట్ట. దేవి కరుణించకపోతే కల్లో కన్పించదట. మీ వల్ల నాక్కూడా పండంటి పిల్లల్ని ప్రసాదించమని, మా వాళ్ళింటికి వెళ్ళి, నేను కూడా దీక్షగాసంతానలక్ష్మి వ్రతం చేస్తానండీ! నాకు ఈ ఒక్క అవకాశం ఇప్పించండి! ఆ అమ్మవారి అనుగ్రహం కలిగి, కలలో కన్పించి, సంతానవతి నౌతావని దీవిస్తే, ఆ దేవి ఆజ్ఞ ప్రకారం మళ్ళీ మీ దగ్గరకు వస్తాను. లేదా మీకు ఈ జన్మలో మళ్ళీ నా మొహం చూపించను,' అని అతన్ని వేడుకొంటూ.

'నువ్వు చెప్పిందంతా నిజమేనంటావా?' అని అడిగాడు రంగనాథం ఆసక్తిగా.

'ముమ్మాటికీ నిజమండీ! ఈ ఒక్క అవకాశం నాకివ్వరూ?'

'సరే. అలాగే మీ ఇంటికి వెళ్ళి ఆ వ్రతం చెయ్యి. అమ్మవారు కల్లో కనిపించకపోతే మళ్ళీ నా దగ్గరకు రాకు.'

'అలాగేనండీ! నాకు అమ్మవారు సంతాన వరాన్ని ఇస్తుందని నమ్మకంగా వుంది. మీరు నాకొక చిన్న మాట ఇవ్వరూ? ఆ దేవి దయవ వల్ల మనకు అమ్మాయి పుడ్తే 'సంతానలక్ష్మి' అని, అబ్బాయి పుడ్తే 'సంతాన లక్ష్మి వరప్రసాద్' అని పేరు పెట్టాలి - అలా అని మాటివ్వండి!'

'అమ్మవారి దయ కలగాలే గానీ తప్పకుండా అలాగే పేరు పెడ్దాంలే! నువ్వు ఈ రోజే బయలుదేరి వెళ్ళు మీ ఊరికి,' అన్నాడు రంగనాథం.

** ** ** ** ** **

విజయ ఎంతో ధైర్యంతో పుట్టింటికి వచ్చిందే కాని వచ్చినప్పటి నుంచీ ఆమెకు మనసులో ఒకటే భయం, ఆందోళన ఆవరించింది - తల్లి బాధపడ్తుందేమోనని ఆమెతో ఏమీ చెప్పలేదు.

రాంబాబు వాళ్ళింట్లో అద్దెకుంటున్నాడు. అతని భార్య తొలిచూలు పురిటికని పుట్టింటికి వెళ్ళింది. అందుకని అతనే వంట చేసుకుంటున్నాడు. విజయ వచ్చినప్పట్నుంచి రాంబాబుతో ఎంతో ఆప్యాయంగా మాట్లాడుతూ కబుర్లు చెపుతోంది.

> **తీర్పు మీదే!**
>
> ఈ కథలో నాయిక విజయ తన పరిధిలో తన సమస్యకు ఓ పరిష్కారం కనుగొన్నది. ఆమె చర్యని మీరు అభినందిస్తారా? అభిశంసిస్తారా? పాఠకుల అభిప్రాయాల్ని ఆహ్వానిస్తున్నాం. చక్కని అభిప్రాయాలకు అతి చక్కని బహుమతులుంటాయి. పాఠకులు తమ రచనతో పాటు తమ పాస్ పోర్టు సైజు ఫోటోలు కూడా పంపగోరతాం.
>
> —ఎడిటర్

'రాంబాబుగారూ! మగాళ్ళు మీరేం వంట చేసుకుంటారు? నేనున్నాళ్ళూ నేను చేసి పెడతాను,' అని అతను యెంత వారించినా వినకుండా అతనికిష్టమైన వంటలన్నీ అడిగి తెలుసుకుని అతనికి నచ్చేట్టుగా వండి పెట్టేది. అతనికి స్వయంగా వడ్డించి, ఎంతో అభిమానం కురిపిస్తూ, జోక్స్ వేసి నవ్విస్తూ, అడిగి అడిగి వడ్డిస్తూ అతనిచేత భోజనం చేయించేది. రాంబాబు విజయ చూపిస్తున్న ఆత్మీయతకు మనస్సులో మెచ్చుకోవడమే కాకుండా ఆమెకు కూడా ఎన్నోసార్లు అభినందనలు తెలి పాడు. వాళ్ళిద్దరి మధ్యా తొందర లోనే సాన్నిహిత్యం ఏర్పడ్డాయి.

ఒకరోజు రాత్రి - రాంబాబు భోంచేశాక, అతనికి తమలపాకులు రాచి యిచ్చి, అతని పడక్కుర్చీ పక్కగా కూర్చుంది విజయ.

'రాంబాబుగారు! ఒకరి జీవితం నాశనం కాకుండా కాపాడగల్గడం మీచేతుల్లో వుంటే, మీరు కాపాడతారా?' అని అడిగింది.

'నేనేం అంతటి వాణ్ణి కాను - ఒకవేళ నా వల్ల ఒకరి జీవితం నిలబడుతుందంటే తప్పకుండా తోడ్పడతాను,' జవాబిచ్చాడు రాంబాబు.

'ఆ జీవితం నాదే అయితే?'

'ఆ జీవితం నీదే అయితే ఎంతో సంతోషంగా సహాయం చేస్తాను - అసలింతకీ నీకొచ్చిన కష్టం యేంటి విజయా?'

విజయ కొంత సేపటి వరకు ఏమీ మాట్లాడలేకపోయింది. మనస్సును ఎలాగో బిగపట్టుకొని రాంబాబు కళ్ళల్లోకి చూస్తూ - తన బ్రతుకు గాధ - తన వ్యధామయ గాధ ... అతనికి వివరించి, చివరగా - 'రాంబాబు గారూ! మీరు నాకు ఆ ఒక్క సాయం చెయ్యాలి. అప్పుడే నా బ్రతుకు నిలబడుతుంది. ఇలా అడగడం తప్పైతే కావచ్చు. కానీ నా బ్రతుకు బాగుపడ్డానికి మరో మార్గం లేకనే ఇలా అడగాల్సి వచ్చినందుకు నన్ను క్షమించండి,' అంటుంటే ఆమెలో దుఃఖం కట్టలు తెంచుకొని వచ్చి వలవలా ఏడ్చేసింది.

రాంబాబు ఆమె కన్నీటిని తుడిచి, ఆత్మీయంగా దగ్గిరకు తీసుకొన్నాడు.

**** *** ** **

విజయ విజయం సాధించింది! - విజయగర్వంతో ఆమె తనువంతా పులకరించింది! - విజయోత్సాహంతో ఆమె మనస్సు పురివిప్పి నాట్యం చేసింది!

తను చేసింది తప్పో ఒప్పో అన్న ఆలోచన తనకనవసరం - తనకు తన బ్రతుకు కావాలి - తన బ్రతుకును తాను నిలబెట్టుకోవాలి - కుక్క కాటుకి చెప్పు దెబ్బే వైద్యం అంటారు - ఇప్పుడు తను ఆ వైద్యమే చేసింది - ముల్లును ముల్లుతోనే తియ్యాలంటారు - మోసాన్ని మోసంతోనే జయించాలంటారు - అవును. నిజమే! - తప్పును తప్పుతోనే జయించాలి- అలానే జయిం చాను కూడా- అనుకుంది విజయ.

తన ఊహల్లో జనించిన సంతానలక్ష్మిని మనస్సులోనే అభినందించుకుంటూ భర్త దగ్గిరకెళ్ళడానికి రైలెక్కింది విజయ! ◆